సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 19 । మార్చి । 2023



అన్నమయ్య వర్ధంతి ఉత్సవాలు ప్రారంభం

పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల 520 వర్ధంతి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. -8లో..



మధ్యాహ్న భోజనం.. మరింత పోషకాలమయం

ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకాన్ని పటిష్టంగా అమలు చేస్తోంది. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.134	రూ.180
రెండోరకం	రూ.80	రూ.130

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 149 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

రామయ్య బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో రాజీపడొద్దు



అధికారులతో మాట్లాడుతున్న టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం

ఒంటిమిట్ట(సిద్దవటం): ఒంటిమిట్ట కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్ల విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని అధికారులను టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ఆదేశించారు. ఇక్కడ జరుగుతున్న పనులను శనివారం సంబంధిత అధికారులతో కలిసి టీటీడీ జేఈవో పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కళ్యాణ వేదిక ప్రాంగణాన్ని సుందరంగా తీర్చి దిద్దాలన్నారు. కల్యాణం రోజున భక్తులకు అన్నప్రసాదం, తాగునీరు, మజ్జిగ, తలంబ్రాలు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సీఈఓ నాగేశ్వరరావు, ఎస్వీబీసీ సీఈఓ షణ్ముక్‌కుమార్, క్యాటరింగ్ ప్రత్యే కాధికారి శాస్త్రి పాల్గొన్నారు.

'అగ్నివీర్'కు దరఖాస్తులు

కడప స్పోర్ట్స్: భారతీయ వాయుసేన, అగ్నిపథ్ పథకంలో భాగంగా అగ్నివీర్ ఎంపికల కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టెప్ సీఈఓ సి.సాయిగ్రేస్ తెలిపారు. ఈనెల 17 నుంచి 31వ తేదీ వరకు అగ్నిపథ్ వాయు.సీడీఏసీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2002 డిసెంబర్, 26 నుంచి 2006 జూన్, 26 మధ్య జన్మించిన అవివాహిత యువత.. ఇంటర్మీడియట్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లీషు సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

రేపు సర్పంచుల సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర సర్పంచులసంఘం, పంచాయతీరాజ్ చాంబర్ ముఖ్య నాయకుల సమావేశం ఈనెల 20వ తేదీ కడపలోని శ్రీనివాస రెసిడెన్సీలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు జరుగుతుందని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తపు మునిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ చాంబర్ జాతీయ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మి ముత్యాలరావు ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. రాయలసీమ జిల్లాలకు చెందిన నాయకులతో చర్చించి బాధ్యతలను అప్పగిస్తారన్నారు. సమావేశానికి హాజరు కావాలని సర్పంచుల సంఘం నాయకులను కోరారు.

705 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడివైఎస్సార్ జిల్లావ్యాప్తంగా శనివారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీషు పరీక్ష జరిగింది. 20,639 మంది విద్యార్థులకుగాను 19,934 మంది హాజరయ్యారు. 705 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వైఎస్సార్ జిల్లా పులివెందులలో వేర్వేరు పరీక్ష కేంద్రాల్లో చూచి రాస్తున్న ఇద్దరిని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు డీబార్ చేశారు. విద్యాశాఖ కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ రాయచోటి పట్టణంలోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఇంటర్‌బోర్డు పరిశీలకుడు రవిశంకర్‌నాయక్ వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్లలో, డీవీఈవో శ్రీనివాసులరెడ్డి బద్వేల్‌లోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. 13 సమస్యాత్మక కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశారు.

'కర్ణాటక ఎన్నికల కోడ్ అమలుకు సహకరిస్తాం'

రాయచోటి: కర్ణాటక ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు సరిహద్దులో అన్నమయ్య జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఎన్నికల అధికారులకు వివరించారు. శనివారం పుట్టపర్తి జిల్లా చిలమత్తూరు చెక్‌పోస్టు సమీపంలో రక్షక అకాడమీలో సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, రవాణా, ఎక్సైజ్‌శాఖ, ఉన్నతాధికారులతో చిక్‌బల్లాపూర్ ఎన్నికల అధికారి ఎన్ఎం నాగరాజు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ గిరీషా, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు హాజరయ్యారు.

ఇక చకచకా అన్నమయ్య

- ప్రాజెక్టు నిర్మాణంలో పురోగతి
- ఖరారైన టెండర్లు
- ఆమోదం తెలిపిన స్టేట్ లెవెల్ టెక్నికల్ కమిటీ
- వారంలోపు అగ్రిమెంట్ ఖరారు



కూలిపోయిన అన్నమయ్య ప్రాజెక్టు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కడప: అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణం పురోగతి దిశగా పయనించనుంది. రూ.660 కోట్లతో నిర్మాణానికి టెండర్లు ఖరారయ్యాయి. రెండేళ్ల కాలపరిమితిలో ప్రాజెక్టు నిర్మించేందుకు రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ టెండర్ దక్కించుకుంది. ఆ మేరకు స్టేట్ లెవెల్ టెక్నికల్ కమిటీ (ఎస్ఎల్‌టీసీ)ఆమోదం లభించింది. రికార్డులు పరిశీలించి అగ్రిమెంటు చేయడానికి ఇరిగేషన్ అధికారులు శ్రీకారం చుట్టారు. వారంలోపు అగ్రిమెంటు ప్రక్రియ పూర్తి కానుంది.

2021 నవంబర్, 19న వరద ఉధృతికి అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయింది.ఒక్కమారుగా పరిసర గ్రామాలను వరద నీరు ముంచెత్తింది. దాదాపు 22 మంది మృత్యువాత పడ్డారు. వేలాది ఎకరాలల్లో పంట పొలాలు దెబ్బతిన్నాయి. పశుపక్ష్యాదులు మృతి చెందాయి. ఒక్కమాటలో చెప్పాలంటే అన్నమయ్య ప్రాజెక్టు దిగువనున్న గ్రామాలు కకావికలమయ్యాయి. ముంపు గ్రామాల్లో పర్యటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పట్లో అన్నమయ్య ప్రాజెక్టు పటిష్ట నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఆమేరకు ప్రాజెక్టు నిర్మాణానికి 2022 డిసెంబర్, 26న టెండర్లను ఆహ్వానించారు.

25 గేట్లు..

అన్నమయ్య ప్రాజెక్టుకు గతంలో 5గేట్లు మాత్రమే ఉండేవి. వాటి ద్వారా 2.17లక్షల క్యూసెక్కులు మాత్రమే విడుదల(డిశ్చార్జి) చేసేలా స్పిల్‌వే ఉండేది. అదనంగా 20 గేట్లు ఏర్పాటు చేయనున్నారు. మొత్తం 25 గేట్లు ఏర్పాటు చేస్తూ, 5.60లక్షల క్యూసెక్కుల నీటి విడుదలకు యోగ్యంగా ఉండే స్పిల్‌వే నిర్మించనున్నారు. రెండేళ్ల కాలపరిమితితో రూ.660.2 కోట్లతో నిర్మించే ఈ ప్రాజెక్టు టెండర్లను హైదరాబాద్‌కు చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ దక్కించుకుంది. కమిషనర్ ఆఫ్ టెండర్స్ అనుమతి తర్వాత ఎస్ఎల్‌టీసీకి సిఫార్సు చేసింది. ఎస్ఎల్‌టీసీ రికార్డులను టెండర్ ప్రక్రియను పరిశీలించి మార్చి 9న ఆమోదం తెలిపింది. బ్యాంకు గ్యారెంటీ, కాంట్రాక్టు సంస్థ అనుభవం పరిశీలన చేపట్టి, 2వారాల్లో అగ్రిమెంటు చేసుకోవాలని ఆహ్వానించింది. మార్చి 24లోపు అగ్రిమెంటు చేసుకోవాల్సి ఉంది.

ప్రాజెక్టుకు గతంలో ఉన్న గేట్లు: 5
అదనంగా నిర్మించనున్న గేట్లు: 20
నీటి విడుదల సామర్థ్యం: 2.17 లక్షల క్యూసెక్కులు
మొత్తం గేట్లద్వారా నీటి విడుదల: 5.60 లక్షల క్యూసెక్కులు
నిర్మాణానికి కాలపరిమితి: 24 నెలలు
ఖరారైన టెండర్ మొత్తం: రూ.660 కోట్లు

పటిష్ట నిర్మాణానికి రూపకల్పన...

2.24 టీఎంసీ సామర్థ్యంతో నిర్మించే అన్నమయ్య ప్రాజెక్టు పటిష్ట నిర్మాణానికి డిజైన్ రూపొందించారు. 10వేల ఎకరాల ఆయకట్టుతోపాటు, రాజంపేట, పుల్లంపేట ప్రాంతాలకు తాగునీరు అందించే లక్ష్యంతో రూపొందించారు. ఈ ప్రాజెక్ట్‌కు ఇదివరకూ ఉన్న మట్టి కట్టల స్థానంలో కాంక్రీట్ కట్టలను ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఎంతటి వరద ఉధృతి ఉన్నా ఏకకాలంలో 5.60లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేసేందుకు అనువైన స్పిల్‌వే, 25గేట్లు ఏర్పాటు చేసేలా డిజైన్ రూపొందించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ దిగువనున్న గ్రామాలకు ఉపద్రవం అనే సమస్యే లేకుండా అనువైన ఆనకట్ట నిర్మాణానికి బీజం పడింది.

రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యం



అన్నమయ్య ప్రాజెక్టుకు టెండర్లు ఖరారయ్యాయి. ఎస్ఎల్‌టీసీ ఆమోదం సైతం లభించింది. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ అగ్రిమెంట్ చేయించుకునేందుకు పిలిచాం. రెండేళ్ల కాలంలో అన్నమయ్య ప్రాజెక్టు పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నాం. నిపుణుల సిఫార్సుల మేరకు పటిష్ట నిర్మాణానికి అనువైన డిజైన్‌కు ఆమోదం దక్కనుంది.

– హరినారాయణరెడ్డి, సీఈ

మాట నిలబెట్టుకున్న సీఎం

- వరద బాధిత కుటుంబాల వారికి ఉద్యోగం



ఉద్యోగాలు పొందిన వారితో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

రాజంపేట: అన్నమయ్య డ్యాం ఎర్త్‌బండ్ తెగిన నేపథ్యంలో నెలకొన్న ప్రకృతిబీభత్సంతో నష్టపోయిన కుటుంబాలను ఆదుకుంటానని భరోసా ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట నిలబెట్టుకున్నారని రాజంపేట శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి, జిల్లాపరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం మేడాభవన్‌లో అన్నమయ్య ప్రాజెక్టు వరద వల్ల నిరాశ్రులైన ఆరు కుటుంబాలకు చెందిన వారికి ఏపీఎండీసీలో ఉద్యోగా వకాశాలను కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్హతను బట్టి ఉద్యోగాలు ఇచ్చారన్నారు. వరదబాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. కాగా ఉద్యోగాలు పొందిన వారు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలను తెలియచేశారు. ఉద్యోగం పొందిన వారిలో దివ్యాంగ జాతీయిస్థాయి క్రికెట్ క్రీడాకారుడు శివకోటి ఉన్నారు. మందపల్లెకు ముఖ్యమంత్రి వచ్చిన సందర్భంగా తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని విన్నవించిన నేపథ్యంలో ఉద్యోగం వచ్చిందని సంతోషం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు పీసీ యోగీశ్వరరెడ్డి, సర్పంచ్ జగన్‌మోహన్‌రెడ్డి, నాగిరెడ్డిపల్లె అర్బన్ సర్పంచి జంబుసూర్యనారాయణ, వీరబల్లి ఎంపీపీ రాజారెడ్డి, పార్లమెంటరీ బీసీవిభాగం జిల్లా అధ్యక్షుడు పసుపులేటి సుధాకర్, కో–ఆప్షన్‌సభ్యుడు రాముయాదవ్, రూరల్ వైఎస్సార్‌సీపీ నేత మందరంగంగిరెడ్డి ,దళితనేతలు దాసరి పెంచలయ్య, సత్యాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠకు తెర

- ఎట్టకేలకు తేలిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితం
- పీడీఎఫ్ ఓట్లతో గట్టెక్కిన రామగోపాల్‌రెడ్డి
- తొలి ప్రాధాన్యతలో స్పష్టమైన మెజారిటీ వెన్నపూసకే..
- విజయావకాశాలను దెబ్బతీసిన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు



జేఎన్‌టీయూ(ఏ)లో ఓట్ల లెక్కింపు దృశ్యం



రామగోపాల్ రెడ్డి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో ఉత్కంఠకు తెరపడింది. 60 గంటల సుదీర్ఘ కౌంటింగ్ అనంతరం ఎట్టకేలకు ఫలితం వెలువడింది. రెండో ప్రాధాన్యత ఓట్లు కలసిరావడంతో టీడీపీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి విజయం సాధించారు. ఆయనకు 7,543 ఓట్ల మెజారిటీ లభించింది. తొలి ప్రాధాన్యత ఓట్లలో మెజారిటీ సాధించడమే కాకుండా..రెండో ప్రాధాన్యతలోనూ ఆధిక్యంలో కొనసాగుతూ వచ్చిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి చివరి రౌండులో ఓటమి చవిచూశారు. రెండో ప్రాధాన్యత ఓట్లు ఎక్కువగా టీడీపీ అభ్యర్థికి వెళ్లడం, తనకు వచ్చిన ఓట్లలోనూ ఇన్‌వ్యాలిడ్ కావడం వెన్నపూస ఓటమికి కారణాలుగా చెబుతున్నారు.

పీడీఎఫ్ ఓట్లే గెలిపించాయి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ, పీడీఎఫ్ పరస్పర అవగాహనతో పనిచేశాయి. ముఖ్యంగా రెండో ప్రాధాన్యత ఓట్లను పరస్పరం బదిలీ చేసుకున్నారు. ఫలితంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గట్టెక్కగలిగారు. ఈ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజుకు 18వేల పైచిలుకు ఓట్లు లభించాయి. ఆయన ఎలిమినేషన్ సందర్భంగా రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించగా.. ఇందులో ఎక్కువగా టీడీపీ అభ్యర్థికే దక్కాయి. దీనివల్లే టీడీపీ గెలిచినట్టు స్పష్టమవుతోంది. బీజేపీ అభ్యర్థి నగరూరు రాఘవేంద్రకు వచ్చిన ఓట్లలోనూ రెండో ప్రాధాన్యత ఓట్లు ఎక్కువగా టీడీపీ అభ్యర్థికి వెళ్లాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేతిలో ఓడిపోతామన్న భయంతో టీడీపీ నాయకులు ముందే పీడీఎఫ్ నేతలను బతిమాలి మరీ అవగాహన పెట్టుకున్నారు. ఇది వారికి కలిసొచ్చింది.

ఉత్కంఠ నడుమ..

కౌంటింగ్ కేంద్రంలో టీడీపీ నాయకులు అలజడి సృష్టించారు. ఆ పార్టీ ప్రధాన నాయకులు స్వతంత్ర అభ్యర్థులకు ఏజెంట్లుగా వచ్చి కౌంటింగ్ కేంద్రంలోనే తిష్ట వేశారు. కౌంటింగ్ ఆద్యంతం అక్కడున్న సిబ్బందిని ఆందోళనకు గురిచేశారు. ఇదే క్రమంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి చెందిన ఓట్లు సైతం కొన్ని టీడీపీ కట్టల్లోకి వెళ్లినట్టు తేలింది. దీంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి మొత్తం ఓట్లను రీకౌంటింగ్ చేయాలని పట్టుపట్టారు. కానీ ఆ బాక్సు వరకూ మాత్రమే కౌంట్ చేస్తామని, మొత్తం రీ కౌంటింగ్ కుదరదని అధికారులు చెప్పారు. కౌంటింగ్ కేంద్రంలో అక్రమాలపై అభ్యర్థి వెన్నపూసతో పాటు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మండిపడ్డారు. ఇందుకు నిరసనగా వెన్నపూస, విశ్వ కౌంటింగ్ కేంద్రం వద్ద కొద్దిసేపు ఆందోళన చేపట్టారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ సుదీర్ఘంగా కొనసాగింది. ఈ నెల 16వ తేదీ ఉదయం 8 గంటలకు మొదలైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ 18వ తేదీ రాత్రి 8 గంటలకు ముగిసింది. మూడు రోజుల పాటు బ్యాలెట్ బాక్సుల మధ్య ఉద్యోగులు, పోలింగ్ ఏజెంట్లు, అభ్యర్థులు గడిపారు. తొలి రోజు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు నువ్వా నేనా అంటూ ఊరించగా.. రెండో రోజు, మూడవ రోజు పట్టభద్రుల ఓట్ల లెక్కింపు, ఫలితాల సరళి నరాలు బిగుసుకుపోయేలా చేశాయి. ప్రధాన రాజకీయ పార్టీల అభిమానులు టీవీల ముందు అతుక్కుపోయారు. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థుల మధ్య మెజారిటీ తక్కువగా నమోదు కావడంతో ఏ రౌండులో ఏమవుతుందోనన్న ఉత్కంఠ కొనసాగింది.

షిఫ్టుల వారీగా విధులు

ఓట్ల లెక్కింపు సందర్భంగా 200 మంది రెవెన్యూ సిబ్బంది, మరో 200 మందికి పైగా పోలీస్ సిబ్బంది మూడు షిఫ్టులుగా పనిచేశారు. కలెక్టర్‌తో పాటు ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు, జాయింట్ కలెక్టర్, ఆర్డీఓల పర్యవేక్షణలో కౌంటింగ్ ప్రక్రియ సజావుగా ముగిసింది. 12 మంది టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు పోలైన 25 వేల పై చిలుకు ఓట్లు, 49 మంది పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులకు పోలైన 2.45 లక్షల ఓట్లను రాత్రింబవళ్లు లెక్కించారు. ఈ ఓట్ల లెక్కింపు సాధారణ ఎన్నికల ఫలితాలను తలపించాయని ప్రజలు చర్చించుకున్నారు.

మిశ్రమ ఫలితాలు

పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు వచ్చాయి. టీచర్స్ ఎమ్మెల్సీగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి గెలుపొందగా, పట్టభద్రుల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి రామగోపాల్‌రెడ్డి గెలుపొందారు. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేయడం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇదే తొలిసారి. పోటీ చేసిన తొలిసారే బోణీ కొట్టడం విశేషం.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధాన అభ్యర్థులకు వచ్చిన తొలిప్రాధాన్యత ఓట్ల వివరాలు

అభ్యర్థి	ఓట్లు
వెన్నపూస రవీంద్రారెడ్డి (వైఎస్సార్‌సీపీ)	95,969
బి.రామగోపాల్‌రెడ్డి (టీడీపీ)	94,149
ఎన్.రాఘవేంద్ర (బీజేపీ)	7,412
పోతుల నాగరాజు (పీడీఎఫ్)	18,758
కమ్మూరు నాగరాజు (స్వతంత్ర)	1,632

పోలైన మొత్తం గ్రాడ్యుయేట్ ఓట్లు: 2,45,687
చెల్లని ఓట్లు : 19,239
చెల్లిన ఓట్లు: 2,26,448

'రెండో ప్రాధాన్యత' లెక్కింపు తర్వాత వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థులకు వచ్చిన మొత్తం ఓట్లు

బి.రామగోపాల్‌రెడ్డి (టీడీపీ): 1,09,781
వెన్నపూస రవీంద్రారెడ్డి (వైఎస్సార్‌సీపీ): 1,02,238
మెజారిటీ: 7,543

ఉపాధ్యాయ వృత్తికి మీరు అన్‌ఫిట్

- విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్
- అన్నమయ్య జిల్లా పూర్వపు డీఈవో తదితరులపై తీవ్ర ఆగ్రహం
- మీలాంటి వారిని దేవుడు కూడా క్షమించడు



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రవీణ్ ప్రకాష్

పీలేరు: 'విద్యార్థుల గురించి పట్టించుకోని మీరు ఉపాధ్యాయ వృత్తికి అన్‌ఫిట్'అంటూ అన్నమయ్య జిల్లా నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన డీఈవో రాఘవరెడ్డి, పీలేరు ఎంఈవో బాలాజీనాయక్, జెడ్పీ స్కూల్ హెచ్ఎం ప్యారూఖాన్‌లపై విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పీలేరులోని మెయిన్ జెడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 7వ తరగతి విద్యార్థుల తరగతి గదిని పరిశీలించారు. పలువురు విద్యార్థులు బెల్టులు, టై, షూ ధరించకపోవడం పట్ల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జరిగిన సిలబస్‌లో ఒక పాఠ్యాంశం తీసుకుని విద్యార్థులు నోటుబుక్కులు చూపించాలని కోరగా, ఏ ఒక్కరి దగ్గర లేకపోవడం చూసి ఇదేంటని ప్రశ్నించారు. ప్రభుత్వం విద్యావ్యవస్థకు వేల కోట్లు ఖర్చు చేస్తోందని, మీలాంటి అధికారులు నిర్వీర్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా విధులు నిర్వహిస్తే దేవుడు కూడా క్షమించడని పేర్కొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి



రాయచోటిలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థికి గోరుముద్ద తినిపిస్తున్న విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి

రాయచోటి/రాయచోటి టౌన్/సంబేపల్లె: విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మక విద్య అందించాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న విద్యా విధానాన్ని సక్రమంగా అందించాలని పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ ఉపాధ్యాయులను ఆదేశించారు. శనివారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కో ఆపరేటివ్ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక, ఆదర్శ పాఠశాలలను ఆయన జిల్లా జేసీ తమీమ్ అన్సారియాతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రాయచోటిలోని నేతాజీ సర్కిల్ వద్ద ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులు పరిశీలించి పనుల ఆలస్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం రాయచోటి కో-ఆపరేటివ్ కాలనీలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా నిల్వ ఉంచిన కోడి గుడ్లు, చిక్కీల్లో క్వాలిటీ, ఎక్స్‌పెరీ డేట్‌లను పరిశీలించారు. స్వయంగా విద్యార్థికి గోరుముద్దను తినిపించి ఆయన రుచిచూశారు.అంతకు ముందు 98 డీఎస్సీ క్వాలిఫైడ్ సంఘం నాయకులు విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌ను రాయచోటిలో కలిశారు.కాంట్రాక్టు టీచర్లుగా నియమాంకం కోసం జీవో ఇచ్చినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలియచేశారు సంబేపల్లె జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలను కూడా ఆయన తనిఖీ చేశారు.బోధనలో అశ్రద్ధ చూపొద్దని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో డీఈఓ పురుషోత్తం, డిప్యూటీ డీఈఓ వరలక్ష్మి, ఎంఈఓ రమాదేవి, తహసీల్దార్ ప్రేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : మదనపల్లెలోని రామారావు కాలనీలో వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యకు ప్రయత్నించారు. రామారావు కాలనీకి చెందిన సోమశేఖర్ (28) ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో కుటుంబ సమస్యలపై ఇంట్లో గొడవ పడ్డాడు. మనస్తాపంతో శుక్రవారం రాత్రి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన స్థానికులు బాధితుడిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా రామారావుకాలనీకి చెందిన రెడ్డమ్మ(50) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తోంది. ఈ క్రమంలో కుటుంబ సమస్యల కారణంగా మనస్తాపంతో శనివారం పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిది. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పరిమళించిన మానవత్వం

వలస కూలీ కుమారుడి మృతదేహానికి అంత్యక్రియలు



బాలుడి మృతదేహాన్ని అంత్యక్రియల కోసం తీసుకెళుతున్న పట్టణ వాసులు

మదనపల్లె : మానవత్వం పరిమళించింది. బతుకుదెరువు కోసం బీహార్ నుంచి వలస వచ్చిన కూలీ కుమారుడి అంత్యక్రియలను శనివారం పట్టణ వాసులు నిర్వహించారు. బీహార్ నుంచి వచ్చిన మహమ్మద్, సైమా దంపతుల కుమారుడు సుహేల్‌తంబి అనారోగ్యంతో మరణించాడు. రోజు వారీ జీవనానికే అంతంత మాత్రంగా ఉన్న మహమ్మద్ ఆర్థిక పరిస్థితి.. కుమారుడి అంత్యక్రియలు నిర్వహించేందుకు సహకరించక పోవడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఇరిగేషన్ ఇంజనీర్, రాయల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు రాయల్‌బాబు రాజేంద్రప్రసాద్ హుదా ఫౌండేషన్‌కు చెందిన సభ్యులను కలుపుకుని బీటీ కళాశాల సమీపంలోని కబరస్థాన్‌లో ముస్లిం మత సంప్రదాయం ప్రకారం బాలుడి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం.. మరింత పోషకాలమయం

- గోరుముద్ద పథకం మెనూలో చేరిన రాగిజావ
- ఈ నెల 21 నుంచి అందజేత
- వారానికి మూడు రోజులు

జిల్లా సమాచారం	
మండలాలు	30
1 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు	1,44,467
గోరుముద్ద అమలవుతున్న పాఠశాలలు	2,190



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

మదనపల్లె సిటీ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకాన్ని (మధ్యాహ్న భోజనం) పటిష్టంగా అమలు చేస్తోంది. ఇప్పటికే పథకంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి నాణ్యత, రుచి, పోషకాలకు పెద్ద పీట వేశారు. కోడిగుడ్లు, చిక్కీ వంటి అధిక ప్రోటీన్లు, విటమినులు ఉండే పదార్థాలను చేర్చారు. అలాగే మంగళవారం పులహోరా, బుధవారం వెజిటబుల్ రైస్ (ఫ్రైడ్ రైస్) గురువారం కిచిడీ, శనివారం తీపి పొంగలి వంటి రుచికరమైన పదార్థాలను వడ్డిస్తున్నారు. దీంతో మధ్యాహ్న భోజనం తినే విద్యార్థుల సంఖ్య బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో మరిన్ని పోషకాలతో కూడిన ద్రవ పదార్థాలను అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావించారు. దీనికి సత్యసాయి సేవా ట్రస్టు నుంచి సంపూర్ణ మద్దతు అందడంతో విద్యార్థులకు రాగి జావ అందించేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ విద్యా సంవత్సరంలోనే రాగిజావ అందించడం ప్రారంభించేలా సన్నాహాలు చేశారు. ఈ నెల 21 నుంచి ప్రారంభించనున్నట్లు విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ప్రకటించింది.

చిక్కీ ప్రత్యామ్నాయ రోజుల్లో..

వారంలోని సోమ, బుధ, శుక్రవారాల్లో విద్యార్థులకు చిక్కీని అందిస్తున్నారు. మిగిలిన మంగళ, గురు, శని వారాల్లో చిక్కీకి ప్రత్యామ్నాయంగా రాగిజావను అందించాలని నిర్ణయించారు.

అందరికీ అందేలా..

జిల్లాలో 2190 పాఠశాలల్లోని 1,44,467 మంది మధ్యాహ్న భోజనం ఆస్వాదిస్తున్నారు. విద్యార్థుల అభీష్టం మేరకు రాగిజావను అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రాగిజావ తయారీకి అవసరమైన ముడిసరుకు ఆయా పాఠశాలలకు అందింది.

రాగి జావతో అధిక ప్రయోజనాలు

రాగిజావలో తక్కువ కొలెస్ట్రాల్, సోడియం ఉంటుంది. బీ కాంప్లెక్స్, విటమిన్ సీ, ఈ, దయామిన్, రిబోఫ్లేవిన్, నియాసిన్, ఫోలిక్‌యాసిడ్, కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, ఫాస్పరస్ అధికంగా ఉంటాయి. మనిషిలోని పోషకాహార లోపాన్ని నివారించడానికి రాగి జావ సహాయకారిగా ఉంటుంది. దీంతోపాటు శరీరంలో వివిధ భాగాలకు ఆక్సిజన్ సరఫరా చేయడంలో దీని పాత్ర కీలకం. ఫైబర్ ఎక్కువగా ఉండటంతో ఎక్కువ సేపు ఆకలి వేయదు. మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తుంది. దీంతో మానసిక ఆందోళన, నిద్రలేమి సమస్యలు తగ్గుతాయి. ఎముకలు గట్టిపడటానికి, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, రక్తంలో గ్లూకోజ్‌ను తగ్గించడానికి పని చేస్తుంది.

అన్ని ఏర్పాట్లు చేశాం



విద్యార్థులకు రాగి జావ అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. నాణ్యతలో రాజీ లేకుండా తయారు చేయాలని కుక్, హెల్పర్లకు ఆదేశాలు ఇచ్చాం. ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించాం.

-క్రిష్టప్ప, డీవైఈఓ, మదనపల్లె

మంచి నిర్ణయం



జగనన్న గోరుముద్దలో భాగంగా విద్యార్థులకు రాగి జావ అందించడం మంచి నిర్ణయం. రాగిజావలో మంచి పోషక విలువలు ఉంటాయి. దీంతో విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారు.

- ఎ.ఫణీంద్ర, ఉపాధ్యాయులు, జెడ్పీహెచ్ఎస్, మదనపల్లె

పిచ్చి కుక్క దాడి.. వృద్ధురాలికి గాయాలు

పెనగలూరు : మండలంలోని నారాయణ నెల్లూరు గ్రామంలో లక్ష్మీనరసమ్మ(70) అనే వృద్ధురాలిపై శనివారం పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. లక్ష్మీనరసమ్మ తన ఇంటి బయట స్నానపు గది వద్దకు రాగానే.. పక్కనే ఉన్న పిచ్చికుక్క ఒక్కసారిగా దాడి చేసింది. ఆమె చేతికి, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలిని వెంటనే రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

మదనపల్లె పట్టణంలో..

మదనపల్లె : పట్టణంలో శనివారం కుక్క దాడిలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. చంద్రాకాలనీకి చెందిన రెడ్డప్ప(40) రోజు వారీ కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో పనికి వెళ్లేందుకు నడిచి వెళుతుండగా మార్గంమధ్యలో ఓ కుక్క దాడి చేసింది. ఘటనలో అతను గాయపడ్డాడు. గమనించిన స్థానికులు ఆటోలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బైక్‌ను ఢీకొన్న కారు

వ్యక్తికి తీవ్ర గాయాలు

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం మదనపల్లె పట్టణంలో జరిగింది. నీరుగట్టువారిపల్లెకు చెందిన నరసింహులు (45) కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. వ్యక్తిగత పనులపై బైక్‌పై పట్టణంలోకి వస్తుండగా మార్గం మధ్యలోని కదిరి రోడ్డులో వెనుకవైపు నుంచి వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో అయన తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని స్థానికులు ఆటోలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పూర్వ విద్యార్థులు మార్గ నిర్దేశకులుగా నిలవాలి

జేఎన్టీయూఏ వీసీ రంగజనార్ధన



వీసీ రంగజనార్ధన, ప్రిన్సిపాల్, అధ్యాపకులతో కళాశాల పూర్వ విద్యార్థులు

కలికిరి : కళాశాల పూర్వ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను చదువులో దత్తత తీసుకుని మార్గనిర్దేశకులుగా నిలవాలని అనంతపురం జేఎన్టీయూ ఉపకులపతి రంగజనార్ధన అన్నారు. కలికిరి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల దశాబ్ద ఉత్సవాలలో భాగంగా శనివారం కళాశాల ఆడిటోరియంలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు చదివిన కళాశాల అభివృద్ధికి కట్టుబడి ఉండాలని, చదువుతున్న విద్యార్థులకు అన్ని విధాలుగా తోడ్పాటునందించి ఆదర్శప్రాయంగా ఉండాలని సూచించారు. నూతనంగా పూర్వపు విద్యార్థుల సంఘం ఆవిష్కరించి విద్యార్థుల నమోదును వీసీ ప్రారంభించారు. కళాశాల ప్రారంభించిన అనతికాలంలోనే అభివృద్ధి చెందడం హర్షణీయమని, ఇంకా డిగ్రీ ప్రదానం చేసే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇలాగే ఏటా పూర్వ విద్యార్థులు హాజరై తమ అనుభవాలు, అభివృద్ధిని జూనియర్ విద్యార్థులకు తెలియజేయాలని కోరారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శుక్రవారం రాత్రి కళాశాలలో క్రీడా దినోత్సవం నిర్వహించి, క్రీడలలో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు జేఎన్టీయూ రిజిస్ట్రార్ సి.శశిధర్ చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులు, మెమెంటోలు ప్రదానం చేసి అభినందించారు. క్రీడలలో మరింత రాణించి యూనివర్సిటీ, రాష్ట్ర, జాతీయ స్థాయిలో కళాశాలకు మంచి గుర్తింపు తీసుకువాలన్నారు. కార్యక్రమాలలో చదరంగం క్రీడాకారిణి సంధ్య గోలి, జేఎన్టీయూఏ క్రీడా మండలి కార్యదర్శి జ్యోతిరెడ్డి, రాష్ట్ర బోర్డ్ ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సీఈఓ దేవకుమార్, ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ సుభాష్, ప్రోగ్రాం కన్వీనర్ షేక్ నషీరా, హెచ్ఓడీలు వెంకటేశ్వరరావు, నాగప్రసాద్‌నాయుడు, డి.నీరజ, విజయలక్ష్మి, కె.అపర్ణ, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కారు బోల్తా.. యువకుడి దుర్మరణం

నలుగురికి గాయాలు



నుజ్జునుజ్జు అయిన కారు

మృతి చెందిన ఇంతియాజ్

గుర్రంకొండ : మండలంలోని నడిమికండ్రిగ పంచాయతీ ఎరుకల వారి ఇళ్ల వద్ద కారు బోల్తా పడి యువకుడు దుర్మరణం చెందగా, నలుగురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ఎరుకలవారి ఇళ్లకు సమీపంలో ఎన్‌హెచ్ 340 జాతీయ రహదారి నిర్మాణ క్యాంపు కార్యాలయం ఉంది. ఇక్కడి నుంచి రోజూ కూలీలు, ఉద్యోగులు మదనపల్లెకు సమీపంలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులకు వెళుతుంటారు. సాయంకాలం పనులు ముగించుకొని మళ్లీ క్యాంపు కార్యాలయానికి వాహనాల్లో చేరుకుంటారు. వైఎస్సార్ జిల్లా దువ్వూరు మండలం ఖానాగుడి గ్రామానికి చెందిన ఎస్.ఇంతియాజ్(32) ఎస్ఆర్‌కే కంపెనీలో జేసీబీ ఆపరేటర్‌గా పని చేస్తున్నారు. శుక్రవారం రాత్రి అంగళ్లు సమీపంలో పనులు ముగించుకొని సంస్థకు చెందిన కారులో కూలీలు ఉదయ్‌కుమార్, రత్నకుమార్, నానాజీ, డ్రైవర్ రామాంజుతో కలసి తమ క్యాంపు కార్యాలయానికి బయలుదేరాడు. క్యాంపు కార్యాలయానికి కొంత దూరంలో కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఇంతియాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవర్, ముగ్గురు కూలీలకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

అన్నమయ్య వర్ధంతి ఉత్సవాలు ప్రారంభం

- పాల్గొన్న అన్నమయ్య వంశీకులు
- సప్తగిరి గోష్ఠిగానం చేసిన అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు



సప్తగిరి గోష్ఠిగానం చేస్తున్న అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు



అన్నమయ్య విగ్రహానికి ప్రత్యేక అలంకరణ

రాజంపేట : పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల 520 వర్ధంతి ఉత్సవాలు తిరుమల తిరుపతి దేవస్థానం, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక, 108 అడుగుల అన్నమయ్య విగ్రహ ప్రాంతంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా తాళ్లపాక అన్నమయ్య ధ్యాన మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. ధ్యాన మందిర ఆవరణలోని చెన్నకేశవస్వామి ఆలయం, సుదర్శనచక్ర దేవాలయం, శ్రీ సిద్దేశ్వరాలయాలను సర్వాంగా సుందరంగా తీర్చిదిద్దారు.

అన్నమయ్యకు వంశీకుల పూజలు

ధ్యాన మందిరంలో ఉన్న అన్నమయ్య విగ్రహానికి అన్నమయ్య 12వ తరానికి చెందిన వంశీకులు నాగరేవతి, పద్మావతిల కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు. తాళ్లపాక వీధుల్లో అన్నమాచార్యుని ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపు చేశారు. ముందుగా విగ్రహానికి పూజలు నిర్వహించారు. గ్రామస్తులు కాయకర్పూరం సమర్పించారు. ఊరేగింపులో అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు పాల్గొని, కీర్తనలు ఆలపించారు. ధ్యాన మందిరంలోని ఆవరణలో ఏర్పాటు చేసిన కళావేదిక వద్ద కళాకారులు సప్తగిరి గోష్ఠిగానం నిర్వహించారు.

పల్లకీ సేవలో ఆకేపాటి



అన్నమయ్య పల్లకీ సేవలో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట రూరల్ : తొలి వాగ్గేయ కారుడు తాళ్లపాక అన్నమాచార్యులకు నిర్వహించిన పల్లకీ సేవలో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పాల్గొన్నారు. మండల పరిధిలోని తాళ్లపాక గ్రామంలో శనివారం మొదలైన శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల 520వ వర్ధంతి వేడుకలలో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి పాల్గొని ముందుగా పూజలు చేశారు. అనంతరం ఆకేపాటి మాట్లాడుతూ తాళ్లపాక అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చొప్పా యల్లారెడ్డి, వీరబల్లి ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, జెడ్పీటీసీ దాసరి ప్రశాంతి పెంచలయ్య, ఎంపీటీసీ ఏ మధుబాబు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

బీహార్ కూలీలకు అడ్డాగా ఆస్పత్రి ప్రాంగణం

- తనిఖీ చేసిన వైద్యాధికారులు
- వెంటనే ఖాళీ చేయాలని హెచ్చరిక



నిర్మాణంలో ఉన్న డీఈఐసీ భవనాన్ని పరిశీలిస్తున్న మెడికల్ సూపరింటెండెంట్ పద్మాంజలిదేవి

మదనపల్లె : స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి ఆవరణం బీహార్ వలస కూలీలకు అడ్డాగా మారడంతో శనివారం మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలిదేవి, ఆర్ఎంఓ దివాకర్, నర్సింగ్ సూపరింటెండెంట్ నాగశ్రీ తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న డీఈఐసీ కేంద్రంలో సుమారు 30 మంది బీహార్ కూలీలు అక్రమ నివాసం ఏర్పరుచుకుని ఉంటున్నట్లు గుర్తించారు. వారు చాలా కాలంగా ఆస్పత్రిలోని గర్భిణిల వార్డు పక్కనే నిర్మాణంలో ఉన్న భవనంలో గదుల్లో గుట్టుగా పడకలు ఏర్పాటు చేసుకున్నారు. ఆస్పత్రి నుంచి విద్యుత్, మోటార్ నుంచి మంచి నీళ్లు వాడుకుంటూ ఉండటాన్ని అధికారులు గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. గర్భిణుల వార్డు పక్కనే వీరంతా స్నానాలు చేస్తుండటంతో.. వార్డులోని మహిళలు ఇబ్బందికి గురై ఆస్పత్రి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు ఆస్పత్రిలోని విభాగాలతోపాటు ఆవరణాన్ని పూర్తి స్థాయిలో తనిఖీ చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆస్పత్రిలో నివాసముండటాన్ని గుర్తించని సెక్యూరిటీ సిబ్బందిని, ఆస్పత్రికి నీరు వదిలేవారిని మందలించారు. అనంతరం ఆస్పత్రిలో పర్యటించి మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. ఆస్పత్రిలో వచ్చే కొత్త వ్యక్తులపై నిఘా ఉంచాలన్నారు. వార్డులో పర్యటించి రోగులకు అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఓపిలో వైద్యుల హాజరును పరిశీలించారు. అత్యవసర విభాగంలో, పోలీసు అవుట్‌పోస్టులో పోలీసులు లేకపోవడంతో సీఐకి సమాచారం ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సెక్యూరిటీ సూపర్‌వైజర్ సురేష్, పారిశుధ్య విభాగం సూపర్‌వైజర్ గిరి ఉన్నారు.

వైఎస్సార్ అగ్రి ల్యాబ్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మదనపల్లె : అన్నదాతలు నకిలీ విత్తనాలు, ఎరువులతో మోసపోకుండా ఉండేందుకు, వారికి భరోసా కల్పించేందుకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గానికి ఒక వైఎస్సార్ అగ్రి ల్యాబ్‌ను ఏర్పాటుచేసిందని జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ అన్నారు. శనివారం పట్టణంలోని వ్యవసాయమార్కెట్ యార్డులో మదనపల్లె నియోజకవర్గానికి సంబంధించి ఏర్పాటుచేసిన వైఎస్సార్ అగ్రిల్యాబ్ పనితీరును ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ..రైతులు తాము కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువుల నాణ్యతపై ఏమాత్రం సందేహం ఉన్నా వారు వాటిని తమ పరిధిలోని వైఎస్సార్ అగ్రిల్యాబ్స్‌కు తీసుకువచ్చి ఉచితంగా పరీక్షించుకుని, నమ్మకం ఏర్పడ్డాకే వాటిని ఉపయోగించవచ్చన్నారు. వైఎస్సార్ అగ్రిల్యాబ్స్‌లో రైతులకు ఉచితంగా సేవలు అందిస్తామన్నారు. రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం స్థాపించిన అగ్రిల్యాబ్స్‌ను ప్రతి రైతు సద్వినియోగం చేసుకునేలా సచివాలయ, వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సువర్ణలక్ష్మి, మదనపల్లె డివిజన్ ఏడీఏ శివశంకర్, అగ్రి ల్యాబ్ ఇన్‌చార్జ్ ఝాన్సీలక్ష్మి, సాయిల్‌టెస్టింగ్ ల్యాబ్ ఏఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన గూడ్స్ రైలింజన్

రాజంపేట : హస్తవరం-నందలూరు రైల్వేస్టేషన్ల మధ్య సమీపంలో కురిసిన భారీ వర్షానికి గూడ్స్‌రైలింజన్ మొరాయించింది. ఈ సంఘటన శనివారం రాత్రి గుండ్లూరు సమీపంలో చోటు చేసుకుంది. బళ్లారికి వెళ్లే జేఎస్‌డబ్ల్యూ గూడ్స్‌రైలు హస్తవరం నుంచి బయలుదేరిన అనంతరం చెయ్యేరు వంతెనకు దగ్గరలో రైలింజన్‌లో సాంకేతికలోపం తలెత్తింది. కుండపోత వర్షం కారణంగా ఈ పరిస్థితులు నెలకొన్నాయని రైల్వే వర్గాలు తెలిపాయి. గంటన్నరకు పైగా గూడ్స్ కదలకపోవడంతో నందలూరు రైల్వేకేంద్రం నుంచి ఏసీలోకోను హస్తవరం వైపు పంపించారు. మొరాయించిన గూడ్స్‌రైలుకు జత చేసి నందలూరుకు తీసుకొచ్చారు. రాంగ్‌లైను వెళ్లి ఈ రైలును క్లియర్ చేశారు. అప్పటికే హస్తవరం చెన్నై ఎగ్మోర్ ఎక్స్‌ప్రెస్ రైలును నిలిపివేశారు. అలాగే గుంటూరు-తిరుపతి మధ్య నడిచే ప్యాసింజర్ రైలుకు కూడా అంతరాయం కలిగింది. ఈ రెండు రైళ్లు గంటన్నరకు పైగా ఆలస్యంగా నడవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. మొరాయించిన గూడ్స్‌రైలు క్లియర్‌కు యుద్ధప్రాతిపదకన చర్యలు తీసుకున్నారు.